క్లుప్తంగా

నెట్టికంటుడికి రూ.1.62 లక్షల విరాళం



దాతలకు తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న ఈఓ కె.వాణి

గుంతకల్లు రూరల్: సత్యసాయి జిల్లా గోరంట్ల మండల కేంద్రానికి చెందిన భక్తులు వి.నిరంజన్, వి.పవన్‌కుమార్ శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ.1.62 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి విరాళం అందజేస్తున్నట్లు తెలిపిన దాతలు.. నగదును ఈఓ కె.వాణికి అందజేశారు. ఈసందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం వారికి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఉరుములతో కూడిన వర్షం

చిలమత్తూరు: చిలమత్తూరు మండలంలో శనివారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. పగటిపూట ఎండ వేడిమి ఎక్కువగా ఉంటుండటంతో ఈ వర్షం వల్ల ప్రజలకు కాస్త ఉపశమనం లభించినట్లయ్యింది.

అక్రమంగా తరలిపోతున్న కలప



అటవీశాఖ అధికారుల ఆధీనంలో ఉన్న వాహనం

పెనుకొండ రూరల్: కొత్తచెరువు వైపు నుంచి పెనుకొండ వైపు అక్రమంగా కలప తరలిస్తున్న ఓ వాహనాన్ని శనివారం కొత్తచెరువు హైవే బ్రిడ్జి సమీపంలో నేచర్ డెవలప్ మెంట్ సభ్యులు హరాలాల్ నాయక్, రంజిత్‌నాయక్ గుర్తించారు. ఎటువంటి అనుమతులు పొందకుండా కలపను తరలిస్తున్నట్లు తెలుసుకుని వాహనాన్ని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. కొందరు అక్రమంగా కలపను కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. వరసగా ఘటనలు చోటు చేసుకుంటున్నా అధికారులు తీరులో మార్పు రావడం లేదు.

సమ్మె జయప్రదం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్: ఈనెల 20 తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో నిరుద్యోగం పెరిగిపోతోందన్నారు. 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చడం అన్యాయమని మండిపడ్డారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, సనావుల్లా, నిర్మల్ కుమార్, నూర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని విద్యానగర్ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవం, నగరోత్సవం నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ కు పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించి అర్చనలు, పూజలు చేపట్టారు. అనంతరం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ఆలయ ఆవరణంలో కొలువుదీర్చి భక్తులచేత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై కొలువుదీర్చి వేద పండితుడు ఉమేష్‌శర్మ ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం పల్లకీలో నగరోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మడకశిరరూరల్: నియోజకవర్గంలోని 28 మందికి రూ.10.92 లక్షల చెక్కులను ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి శనివారం పంపిణీ చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దిగుబడి సరే.. ధర ఏదీ?

- ఆశాజనకంగా మొక్కజొన్న పంట
- గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్న రైతులు
- ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్



ఎల్లోటిలో మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేస్తున్న మొక్కజొన్న పంట

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమానికి అనేక పథకాలు ఉండేవి. పంటలు సాగు చేసినప్పటి నుంచి పంట నూర్పిడి.. విక్రయించుకునే వరకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రోత్సహించేవారు. కూటమి సర్కారు ఏర్పాటైన తర్వాత రైతులను పట్టించుకోవడంలేదు. ఎంతో ఆశతో అప్పు చేసి పంటలు సాగు చేసిన రైతులకు ..తీరా గిట్టుబాటు ధర లేక, మార్కెట్ల సౌకర్యం లేక పంటలు పండించినా ప్రయోజనం లేకపోతోంది.

నియోజకవర్గంలోని మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల్లో ఎకరాకు రూ.20 వేల వరకు ఖర్చు పెట్టి దాదాపు 900 ఎకరాలకు పైగా రబీలో మొక్కజొన్న పంట సాగు చేశారు. పంట దిగుబడి కూడా బాగా వచ్చిందని రైతులు చెప్తున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పంట కోతకు రావడంతో రైతులు కూలీలు, యంత్రాల ద్వారా పంటను తొలగించి నూర్పిడి చేసి, విక్రయించడానికి సిద్ధం చేస్తున్నారు. ఈఏడాది పంటకు వాతావరణం అనుకూలించడం, తెగుళ్ల వ్యాప్తి పెద్దగా లేకపోవడంతో దిగుబడి వచ్చిందంటున్నారు. ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్లు వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందంటున్నారు.

గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి:

అప్పులు చేసి చెమటోడ్చి పండించిన మొక్కజొన్న పంటకు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.మార్కెట్‌లో గత ఏడాది కన్నా తక్కువగా క్వింటా మొక్కజొన్న రూ.2,250 ధర ఉంది. పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులు నష్టపోకుండా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

కొనుగోలు కేంద్రాలు లేవు..

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించి ఒక నుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఖర్చులు తగ్గుతాయని రైతులు చెప్తున్నారు. కనీసం పండించిన పంటనైనా కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ స్థాయిలోనే వ్యవసాయ, అనుబంధ శాఖలు ఎప్పటికప్పుడు పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇచ్చేవారు. ఆర్బీకే సిబ్బంది గ్రామాల్లో పర్యటించి, రైతులకు అవసరమయ్యే సూచనలు ఇచ్చేవారు. పంటకు తెగుళ్లు సోకితే వెంటనే నివారణ చర్యలు తెలియజేసేవారు.

గిట్టుబాటు ధర కల్పించాలి..



బోరు బావి కింద రబీలో సాగు చేసిన మొక్కజొన్న పంటలో మంచి దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ.20 వేల ఖర్చు పెట్టి దాదాపు ఎకరాలో సాగు చేసిన మొక్కజొన్న పంటకు తెగుళ్లు వ్యాపించలేదు. 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. క్వింటా రూ. 2,250 చొప్పున విక్రయించా. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.

– శ్రీరామిరెడ్డి, రైతు, మడకశిర

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసులు

పెనుకొండ: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎస్టీఏ అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.కుమార్‌రెడ్డి కోరారు. శనివారం విజయవాడలోని విద్యాభవన్‌లో రిజిష్టర్ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం జరిగింది. విద్య, ఉపాధ్యాయ సమస్యలను రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుకు విన్నవించినట్లు కాడిశెట్టి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైస్కూల్‌లో ఉన్న ప్రైమరీ క్లాసులకు ఫౌండేషన్ స్కూల్స్‌కు బేసిక్ ప్రైమరీ పాఠశాలలకు ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి ఒకే విధంగా ఉండాలని సూచించారు. ఉన్నత పాఠశాలల్లో ప్రతి 45 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఉండేలా చూడాలన్నారు. విద్యార్థుల సంఖ్య 10 మంది దాటితే ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో (యూపీఎస్) అన్ని సబ్జెక్టులకు టీచర్లను కేటాయించాలన్నారు. భార్య చనిపోయిన ఉపాధ్యాయులకు 18 సంవత్సరాల్లోపు వుంటే మహిళా వితంతువులకు ఇచ్చిన విధంగా బదిలీల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అంతర్ జిల్లా బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని సూచించారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు వారి సొంత మండలంలోని పాఠశాలలను కేటాయించాలన్నారు. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు బదలీ షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు కూడా జనరల్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్‌లో చేర్చాలని కోరారు. ఉన్నత పాఠశాలల ప్లస్ ఉద్యోగులకు రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని కోరినట్లు వివరించారు.

ఆకట్టుకున్న జానపద కళా ఉత్సవం



జానపద ఉత్సవాలను ప్రారంభిస్తున్న తుముకూరు యూనివర్సిటీ వీసీ ప్రసన్నకుమార్

పావగడ: స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం నిర్వహించిన జానపద కళా ఉత్సవం ఆకట్టుకుంది. తుముకూరు విశ్వవిద్యాలయం వీసీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జానపద కళారూపాలు జాతీయ సమైక్యతకు దోహదపడతాయన్నారు. గ్రామీణ జీవితం ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. చిరుధాన్యాల వంటకాలు ఆరోగ్యకరమన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన చిరుధాన్యాలు, పలురకాల వంటకాలు ప్రదర్శనకు ఉంచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివానందయ్య, మారెప్ప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి



గుడిబండ పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ ఫిరోజ్‌బేగం



రొళ్ల మండలం జీజీ హట్టిలో మాట్లాడున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి

గుడిబండ: ప్రజలు ఆరోగ్య సూత్రాలను పాటించాలని జిల్లా వైద్యాధికారిణి ఫైరోజా బేగం సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. పాము,కుక్కకాటు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వేసవిలో ఎండ దెబ్బకు గురి కాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రొళ్ల: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని పెనుకొండ డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి, మడకశిర ఐసీడీఎస్ సీడీపీఓ నాగమల్లేశ్వరి తదితరులు సూచించారు. శనివారం వారు మండలంలో పర్యటించారు. మండలంలోని జీజీ హట్టి గ్రామంలో వారం రోజులుగా అతిసారతో 38 మందికి పైగా అస్వస్థతకు గురి అయ్యారు. అమూల్య అనే చిన్నారి మృతి చెందిన విషయం విదితమే. గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామస్తులతో వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అతిసార బారిన పడిన వారు వైద్యులు సూచించిన మేరకు జాగ్రత్తలు పాటించాలన్నారు. తహసీల్దార్ షేక్షావలి, ఎంపీడీఓ రామరావు, డీఐఓ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ గిరియప్ప, డాక్టర్లు శివానంద్, సౌందర్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సన్నమ్మ, లీలావతి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టుచీరల బ్యాగు అందజేత

హిందూపురం: రైలులో మరిచిపోయిన రూ.50 వేలు విలువగల పట్టుచీరల బ్యాగును రైల్వే ఎస్ఐ సజ్జప్ప శనివారం బాధితులకు అందజేశారు. పరిగి రోడ్డులో నివాసం జుబేర్, సల్మా దంపతులు బెంగళూరు నుంచి హిందూపురం వస్తూ గత 7వ తేదీ రైలులో బ్యాగ్‌ను మరిచిపోయారు. బ్యాగులో విలువైన ఆరు పట్టుచీరలు ఉన్నాయి. బెంగళూరు నుంచి ప్యాసింజర్ రైలులో ప్రయాణం చేస్తూ బంధువులు గౌరీబిదనూర్‌లో దిగిపోయారు. చీరల బ్యాగు వారు తీసుకుని ఉంటారని భావించారు. తీరా ఆరా తీస్తే బ్యాగును రైలులో వదిలి వచ్చినట్లు తెలుసుకుని సాయంత్రం స్టేషన్ మాస్టర్ వద్దకు వెళ్లి తమ బ్యాగు పోయిందని వాపోయారు. ఆయన సూచన మేరకు రైల్వే ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం రైలులో లభ్యమైన బ్యాగును పోలీసులు బాధితులకు అందజేశారు.

మురళి నాయక్‌కు నివాళి



పెనుకొండలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు



పెనుకొండ రూరల్: జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



తెలుగు తల్లి సర్కిల్‌లో నినాదాలు చేస్తున్న హిందూ సంఘాల నేతలు



మడకశిరలో అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన దృశ్యం

పెనుకొండ: యుద్ధంలో మృతి చెందిన జవాన్ మురళి నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని బీజేపీ నాయకులు ఆకాంక్షించారు. శనివారం అంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. భారతదేశం మురళి నాయక్ త్యాగాన్ని మరువదని కొనియాడారు. అదేవిధంగా సీపీఎం నాయకులు దర్గా సర్కిల్‌లో మురళి నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎనుముల రామకష్ణ, హనుమంతు, రవి, హరి, గంగాధర్, బాబావలి పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి శనివారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో బీజేపీ, దళిత సంఘాల నాయకులు నివాళులర్పించారు. జోహార్ మురళి నాయక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎనుమల రామకృష్ణ, రామాంజనేయులు, దళిత సంఘాల నాయకులు ఎంఎస్ మూర్తి, పెద్దన్న, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీర మరణం పొందిన మురళి నాయక్‌కు విజ్ఞాన్ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం విజ్ఞాన్ పాఠశాలలో మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్ మురళి నాయక్ అంటూ నినాదాలు చేశారు. పదేళ్ల పాటు తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థి దేశం కోసం ప్రాణాలు అర్పించాడని తెలిపారు. భౌతికంగా దూరం కావడం బాధాకరమని కరస్పాండెంట్ మల్లికార్జున తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: పట్టణంలో వీర జవాన్ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, కూటమి నాయకులు జాతీయ జెండాలతో శనివారం ర్యాలీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి, నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ తదితరులు మురళీనాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, కూటమి నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూకాశ్మీర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు ఆత్మకు శాంతి కలగాలని శనివారం రాత్రి లేపాక్షిలో వివిధ పార్టీలకు చెందిన ప్రజలు, నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ చేసి నివాళులర్పించారు. నంది విగ్రహం నుంచి సబ్‌స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు.

పెనుకొండ రూరల్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో శనివారం విశ్వహిందూ పరిషత్తు, హిందూ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. కాశీ విశ్వేశ్వర దేవాలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. భారత్ మాతాకు జై, హిందూస్థాన్ జిందాబాద్, జోహార్ మురళి నాయక్ అంటూ నినాదాలు చేశారు. ట్యాంక్ సర్కిల్‌లో పాకిస్థాన్ జెండాలు, ఆదేశ ప్రధాని ఫొటోలను దహనం చేశారు. అనంతరం ఉరివాకిలి ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్తు జిల్లా అధ్యక్షుడు రామకిష్టప్ప, సభ్యులు వేదవ్యాస్ స్వామి, ఎనుమల రామకృష్ణ, డాక్టర్ గోపీనాథ్, కోన స్వామి, డాక్టర్ రంగనాథ్ రెడ్డి, మమత, రామాంజనేయులు, కళ్యాణ చక్రవర్తి, రాము, జయచంద్ర యాదవ్, శ్రీనాథ్, ఉదయ్ బాను



లేపాక్షిలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న ప్రజలు



సోమందేపల్లి: నివాళులర్పిస్తున్న విజ్ఞాన్ పాఠశాల యాజమాన్యం

రొళ్ల: పట్టణంలో వీర జవాన్ మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ శనివారం ర్యాలీ చేశారు. రత్నగిరి గ్రామానికి వెళ్లే ప్రధాన వీధుల గుండా బస్టాండ్ వరకు జాతీయ జెండాతో పాటు, మురళీనాయక్ చిత్ర పటాన్ని చేత పట్టుకుని, కాగడాలతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వక్కలిగ సాధికర సమితి రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, కన్వీనర్ దాసిరెడ్డి, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పావగడ: వీర జవాన్ మురళీ నాయక్‌కు పట్టణంలోని ముస్లింలు శనివారం నివాళులర్పించారు. మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో జామీయా మసీదు హజ్రత్ ముబారక్, ఆర్బీ ఖాన్,షా బాబు, నిజాం అలి,గౌస్‌మోద్దీన్, సాదిక్, కౌన్సిలర్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



పావగడలో అమర వీరుడు మురళీనాయక్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ముస్లింలు



రొళ్లలో కాగడాలతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సమ్మె జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మికసంఘాల నాయకులు

హిందూపురం: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న చేపడుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. తూమకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో తూమకుంట పారిశ్రామికవాడలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం వివిధ ఫ్యాక్టరీ కార్మికులకు పంపిణీ చేశారు. అలాగే అన్ని పరిశ్రమలకు సమ్మె నోటీసులు అందించామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు మారుతీరెడ్డి, తూమకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు పి.బాబు, అనుబంధ సంఘ నాయకులు చలపతి, సిద్ధగిరి సురేష్, సమీవుల్ల తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

అగళి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఈ నెల 12 నుంచి 19 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ జాఫర్ శనివారం తెలిపారు. అగళి, రొళ్ల మండలాల నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులు 101 మంది, ద్వితీయ సంవత్సరం 59 మంది హాజరుకానున్నట్లు తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటిపరీక్షలు చేస్తున్న డాక్టర్ నిఖిత

హిందూపురం: స్థానిక ఎంజీఎం ఉన్నతపాఠశాల ఆవరణంలో బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి బృందం, ట్రీనిటి సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 575 మంది హాజరురాగా.. 225 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. ఎంపికైన వారిని బెంగళూరు శంకర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి, ఆపరేషన్లు పూర్తి చేసి తిరిగీ హిందూపురానికి తీసుకువస్తారు. అలాగే గత నెలలో ఆపరేషన్ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు రేణు, నిఖిత, శ్రావంతి, అభినయ్, క్యాంప్ ఇన్‌చార్జి శివ, వలంటీర్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని నడలూడంలో ఆంజనేయస్వామి ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామి వారి చిత్రపటాన్ని కాడెద్దుల బండిలో ఉంచి వీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ముద్దరంగప్పకు కవి రత్న బిరుదు



అమరాపురం: మండల కేంద్రానికి చెందిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు ముద్దరంగప్పను కవిరత్న బిరుదుతో సత్కరించారు. శుక్ర, శనివారాల్లో ఏలూరులోని మహాలక్ష్మి గోపాల స్వామి కల్యాణమంటపంలో తెలుగు సాహితీ ఉత్సవాలు కన్వీనర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అమరాపురం ముద్దరంగప్పకు కవిరత్న బిరుదుతో ప్రశాంసా పత్రం అందించారు.